# ముక్తి

**-బలభద్ర పాత్రుని రమణి**

**నేను నమ్మలేకపోయాను. ఇది నేను ఊహించని విషయం! రకరకాల సమస్యలతో నిత్యం సతమతమయ్యే వసుంధర నన్ను చూసి జాలిపడేలాంటి స్థితిలో నేను వుండడం అనేది నాకు జీర్ణం కాని విషయం!**

**''ఏమిటండీ అలా అయిపోయారు?'' అన్నాడు.**

''నేను ఇష్టంలేక పెళ్ళి చేసుకోలేదు. కానీ ఈ లోకం నాకు పెళ్ళి కాలేదు అనుకుంటుందెందుకూ?'' కోపంతో నా గొంతు వణికింది.

''మీరు చూస్తుండగా నేను మా మేడ మీంచి కిందపడి... నేను పడలేదు ... జంప్ చేశాను అంటే నమ్ముతారా? ఇదీ అంతే! లోక సహజం కాని విషయాలు జనం నమ్మడానికి ఇష్టపడరు'' అన్నాడు.

''మీరూ నమ్మడం లేదా?'' అడిగాను.

''నమ్ముతాను. మంచి ఉద్యోగం, అందం, తెలివితేటలూ వున్న మీలాంటి వారికి పెళ్ళి కాలేదంటే ఎలా నమ్ముతానూ.. తగ్గవాడు దొరకక ఇలా వుండిపోయారంటే నమ్ముతాను'' అన్నాడు.

అతని మాటల్లో శ్లేషమైనా ఉందేమోనని చూశాను. అదేం కనిపించలేదు.

''నేను వెళ్ళొస్తాను'' అతను లేచాడు.

''మీ ఫీజు?'' అడిగాను.

''టైం వచ్చినప్పుడు అడిగి తీసుకుంటాను'' అని వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం కూతురి చేత వసుంధర భోజనం పంపించింది. వద్దు అనలేకపోయాను. వంట చాలా రుచిగా చేసింది.

సాయంత్రం బాల్కనీలో కూర్చుని రాబర్ట్ కోసం చూశాను. చీకటిపడ్తుండగా వచ్చి తలెత్తి మా ఇంటికేసి చూశాడు.

నేను అప్రయత్నంగా చెయ్యి ఊపాను.

''కాఫీ దొరుకుతుందా మేడమ్?'' అడిగాడు.

''ష్యూర్!'' ఉషారుగా అన్నాను.

అతను చొరవ తీసుకుని మాట్లాడడం, జోక్స్ వెయ్యడం నాకేమీ అసహజంగా అనిపించలేదు. ఇద్దరం కాసేపు కారమ్స్ ఆడాం.

''ఇక్కడే భోజనం చెయ్యకూడదూ!'' అన్నాను.

''ఈ ఆఫర్ ఓపెన్‌గా ఉంచండి. మెస్ తిండి విసుగు పుట్టినప్పుడు వస్తాను'' అన్నాడు.

మరునాడు ప్రొద్దుట కూడా వచ్చి టెంపరేచర్ చూసి జ్వరం లేదు అని రూఢి అయ్యాక నాకు ఆఫీసుకు వెళ్ళడానికి పర్మిషన్ ఇచ్చాడు.

సాయంత్రాలు అతనితో కారమ్స్ ఆడడం నుంచి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కెళ్ళడం దాకా వచ్చింది మా పరిచయం. ఆ వారంలో షాపింగ్‌కెళ్ళి నాలుగు చీరలు కొన్నాను. అద్దం ముందు వుండే సమయం నాకు తెలీకుండానే పెరుగుతోంది.

నీలమ్మ ఊరి నుంచి వచ్చింది. తను లేనప్పుడు నాకు జ్వరం వచ్చిందని తెలిసి కళ్ళనీళ్ళు పెట్టుకుంది. రాబర్ట్ మందిచ్చాడని తెలిసి అతనికి బోలెడు కృతజ్ఞతలు చెప్పింది.

రాబర్ట్ భోజనానికి ఉన్న రోజున నేనే వంట చేశాను. సాంబారు చాలా బాగా చేశానని మెచ్చుకున్నాడు. అతని కాంప్లిమెంట్స్‌కి నేను పొంగిపోయాను. భోజనాలయ్యాక ఇద్దరం గార్డెన్‌లో కూర్చుని మ్యూజిక్ వింటూ కబుర్లు చెప్పుకుంటున్నాం.

ఉన్నట్టుండి రాబర్ట్ ముందుకి ఒంగి ''ఐ లవ్ యూ!'' అన్నాడు.

నేను అర్థం కానట్టు ''ఏంటి?'' అన్నాను.

అతను నా చెయ్యి పట్టుకొని ''ఐ మీన్ ఇట్!'' అన్నాడు.

నేను చెయ్యి విదిలించుకుని ''వాట్ ఈజ్ దిస్?'' అన్నాను.

''ఇష్టం! మీకు అభ్యంతరం లేకపోతే మనిద్దరం పెళ్ళి చేసుకుందాం. నాకు రిలిజన్ ఫీలింగ్ లేదు'' అన్నాడు.

''పెళ్ళా?'' ఆశ్చర్యంగా అన్నాను.

''పెళ్ళి కాకుండా గడుపుదామా? దానికైనా ఓ.కే.నే!'' అన్నాడు.

''ఏమిటి మీ ఉద్దేశం?'' కోపంగా అడిగాను.

''తప్పుగా ఏం మాట్లాడాను? పెళ్ళి అంటే ఇష్టపడకపోతే, పెళ్ళి కాకుండానే గడుపుదాం అన్నాను. మీ అభిప్రాయలు గౌరవించడం నా ఉద్దేశం!'' అన్నాడు.

''ఇక స్త్రీ ఒక పురుషుడితో కాస్త క్లోజ్‌గా మూవ్ అయితే ఇదేనన్నమాట అర్థం!'' కోపంగా అన్నాను.

''క్షమించండి! మీకు ఏ వ్యామోహం, ఆకర్షణా లేకపోతే నా కోసం ప్రత్యేకంగా ఎందుకు తయారయ్యారూ? రుచిగా వంట చేసినా కాంప్లిమెంట్స్ కోసం ఎందుకు ఎదురు చూశారూ? నాతో కలిసి షైర్ రావడానికి ఎందుకు ఉత్సాహం చూపించారూ? ఇవన్నీ ఒక ఆడ స్నేహితురాలితోనే చేయచ్చుగా!'' అన్నాడు.

''నేను.. నేను...'' మాటలు రాక తడబడ్డాను.

అతను నా దగ్గరగా జరిగి నా మొహాన్ని తన చేతుల్లోకి తీసుకుని పాపిటిలో ముద్దుపెడ్తూ... ''సంధ్యా సృష్టి ధర్మాన్ని ఎదిరించేటంత బలవంతు

## జరిగిన కథ

**ఉద్యోగంలోను, వయసులోను రిటైర్‌మెంట్ స్టేజీకి సమీపిస్తున్న వసుంధరకు బాధ్యతలు ఎక్కువే. ఎవరైనా వచ్చి కళ్ళనీళ్ళు పెట్టుకుంటే చాలు వెన్నపూసలా కరిగిపోతుంది. ఆమెను భర్త వదిలేసినా బాధ్యతతో నలుగురి పిల్లల్ని పెంచి పెళ్ళిళ్ళు చేస్తుంది. కానీ వారు ఎప్పుడూ ఏదో వంకతో ఆమె నుంచి అందినంత గుంజుకెళ్ళేవారే. వసుంధర గురించి ఆలోచిస్తుంటుంది ఆమె పనిచేసే ఆఫీసులోని తోటి లేడీ ఆఫీసర్. ఆమెకు ఎదురింట్లో పైపోర్షన్‌లో వుండే రాబర్ట్‌తో పరిచయం కలుగుతుంది.**




లం కాదు మనం! నువ్వు పంజరంలో కూర్చుని నేను మిగతా పక్షుల కంటే గొప్పదానిని అనుకుంటు న్నావు. పంజరం తలుపు తెరుచుకుంటే నువ్వూ వాటిలాగే ఎగుర్తావు... కూస్తావు!'' అన్నాడు.


''నో...'' అంటూ నేను అతని చేతుల్ని తప్పించుకుని లేచి నిలబడ్డాను.

''నువ్వు భయపడి దూరంగా పారిపోతున్నావు ... నిన్ను నువ్వు స్వర్గం అనుకుని ఇరుకు గదిలో ఖైదు చేసుకుంటున్నావు!'' అన్నాడు.

''కాదు... కాదు'' అన్నాను.

''ఆలోచించుకుని తెలియజెయ్యి. తొందర లేదు'' అని వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి నేను నిద్రపోలేదు. అతనితోడూ, సాన్నిహిత్యం నేనెందుకు కోరుకున్నానూ? నేను పువ్వులు కొనుక్కుంటే అతను 'పే' చేస్తే ఎందుకు ఊరుకున్నానూ? అతని డ్రైవింగ్‌లో వెనకాల కూర్చుని ఎందుకు రిలాక్స్ అయ్యానూ? నాకు ఒంట్లో బాలేదని అతను తల్లడిల్లిపోతే ఎందుకు




ఊరట చెందానూ? అతనికి అందంగా కనిపించాలని ఎందుకు ఆరాటపడ్డానూ?

అన్నింటికీ ఒకే సమాధానం.

అతను పురుషుడు. ఆపోజిట్ సెక్స్! కానీ పెళ్ళిలాంటి ఆలోచన చెయ్యడానికి నా మనసు ఒప్పుకోవడం లేదు. ఈ స్నేహితుడే తాళికట్టిన మరుక్షణం నుండీ డిక్టేటర్ అవుతాడు అంటోంది!

తెల్లవార్తుండగానే వైదేహి దిగింది.

కళ్ళు తెరవగానే నా నుదుట ఇంత విభూతి అద్దింది.

''ఈ రోజు నువ్వు నాతో ఒక చోటుకి రావాలి!'' అంది.

''ఏదైనా జాతరా లేక ఎవరిదైనా పెళ్ళా?'' అన్నాను. దానికిలాంటి సరదాలెక్కువ.

''అదేం కాదు... నిత్యానందబాబా వారి ఆశ్రమానికెళ్ళాలి'' కళ్ళు మూసుకుని చెంపలు టపటపా వాయించుకుంటూ అంది.

''ఏం? ఏ తాయెత్తయినా కట్టి శశాంక్‌ని టోటల్‌గా మార్చేశాడా?'' అన్నాను.

''కాదే... నేనే మారిపోయాను. మొన్న గుంటూరొచ్చారు. ఆయన దర్శన భాగ్యంతోనే చాలా సమస్యలు వాటంతటవే పరిష్కారమయిపోయాయి. హైద్రాబాద్‌లో తన ఆశ్రమం చిరునామా చెప్పి రమ్మన్నారు. నువ్వు వస్తే నీకూ మేలు కలుగుతుంది'' అంది.

నేను వేపకాయ తిన్నట్టు మొహం పెట్టాను. కానీ వైదేహిది వుడుం పట్టు. దాని నస భరించలేం. ''సరే... సరే... ముందు నన్ను లేవనీ?'' అని ఒప్పుకోక తప్పలేదు.

ఆ రోజు రాబర్ట్ రాడనుకున్నాను. కానీ హాస్టల్‌కి వెళ్ళే ముందు ఠంచన్‌గా వచ్చి ''నా కాఫీ ఏదీ? చుట్టాలొచ్చారని ఎగ్గొట్టాలనుకున్నారా?'' అన్నాడు. నాకు సంతోషం కలిగింది.

వైదేహికి పరిచయం చేశాను.

ఆశ్రమానికి వెళ్తుంటేదార్లో అడిగింది ''ఏవిటి కథ? ఉషారుగా కనిపిస్తున్నావ్?''

''ఏం లేదు'' అన్నాను. కానీ ఆశ్చర్యం వేసింది ఇన్నాళ్ళూ నేను నిస్సారంగా, నిరుత్సాహంగా వున్నానా? అని.

OOO

ఆశ్రమం అన్న బోర్డు దగ్గర నుంచి చాలా దూరం లోపలికి వెళ్తేకానీ ఆశ్రమం రాలేదు. చుట్టూ మావిడి చెట్లూ, పనస చెట్లతో ఆహ్లాదంగా ఉంది. కాషాయ వస్త్రాలలో ఆడామగా హడావిడిగా తిరుగుతున్నారు.

వైదేహి నాతో గుసగుసగా బాబా వారి మహిమలు చెప్తోంది. ''మా చిన్నాడబిడ్డ భర్తకి ఢిల్లీ నుండి ట్రాన్స్‌ఫర్ అవుతుందని చెప్పిన వారానికే ఆర్డర్స్ వచ్చాయి. శశాంక్ కడుపునెప్పికి పది రోజులు విభూతి పాలల్లో కలుపుకుని తాగగానే తగ్గిపోయింది. ఇంకా నాకేమో ఇప్పుడూ...'' అని సిగ్గుపడి ''మూడో నెల'' అంది.

''అంతా ఆయన మహిమేనా?'' అడిగాను.

''ష్...' అని చెంపలు వేసుకుంది.

పొడవాటి హాల్లో సింహాసనంలాంటి దానిమీద బాబా కూర్చుని ఉన్నారు. పొడవాటి గెడ్డం, కాషాయ వస్త్రాలూ, మెడలో రుద్రాక్షలూ... కుడిచేతి ఉంగరం వేలికి మాత్రం వజ్రపుటుంగరం! విరాళాల హుండీ ధగధగా మెరుస్తోంది.

వైదేహి వెళ్ళి సాష్టాంగపడింది. ఆమె తలమీద చెయ్యి వేసి దీవించి నా వైపు చూశాడు.

వైదేహి నమస్కరించమని సైగలు చేసింది.

నేనూ చేతులు జోడించాను.

''మా కజిన్!'' సంజాయిషీగా అంది వైదేహి.

నిత్యానంద బాబాని ఎక్కడో చూసినట్టుగా అనిపించింది నాకు. ముఖ్యంగా కుడి బుగ్గమీద పెద్ద పుట్టుమచ్చ! ఎవరో... నాకు బాగా తెలుసు... ఎవరూ? నా మనసు వేగంగా ఆలోచిస్తోంది.

వైదేహి తన ప్రోబ్లెమ్స్ లిస్ట్ ఆయనతో ఏకరువు పెడ్తోంది.

నాకు సడెన్‌గా గుర్తుకొచ్చేసింది.

''మీరు ... మీరు.. మా స్కూల్లో మేథమేటిక్స్ చెప్పేవారు కదూ? రామనాధశర్మ సార్!'' అన్నాను.

వైదేహి నా వైపు విచిత్రంగా చూసింది.

బాబా చిరునవ్వుతో ''పూర్వాశ్రమపు జ్ఞాపకాలన్నింటినీ తుడిచి పెట్టేశాకనే ఈ కాషాయం కట్టాను. ఇంక వాటితో పనిలేదు బిడ్డా! ఇప్పుడేం కావాలో చెప్పు!'' అన్నాడు.

''నాకేం వద్దు కానీ మీరు రామనాధశర్మ సార్ ఔనా కాదా?'' అన్నాను కుతూహలంగా.

ఆయన నిశ్చలంగా చూసి ''గతం గతః ఇప్పుడు ఆ పేరూ, పూర్వ జీవితం త్యజించాను'' అన్నాడు.

''అంటే మీరు రామనాధశర్మ సారే!'' తృప్తిగా అన్నాను. లెఖ్ఖల సార్ అన్న నా లెఖ్ఖ తప్పలేదు.

ఆయన కాస్త చిరాకుగా ''రామనాధశర్మ కాదు రామనాధశాస్త్రి!'' అన్నాడు.

నాకు నవ్వొచ్చింది. ''సర్వం త్యజించారా స్వామీ!'' అన్నాను.

వైదేహి నా వంక భయంగా చూసింది.

''ఔను!'' గంభీరంగా అన్నాడు.

''మీ పేరులో శాస్త్రికి బదులు శర్మ అంటేనే భరించలేకపోయారు.. పేరు మీద కూడా ఆశపోని మీరేం త్యజించినట్టూ?'' అన్నాను.

ఆయన కనుబొమ్మలు ముడివడ్డాయి. పక్కన కూర్చుని వింజామరతో విసుర్తున్న ఆడ భక్తురాలు కూడా నా వంక గుర్రుమని చూసింది.

''బిడ్డల తప్పులు దిద్దడం గురువుగా నా బాధ్యత!'' అన్నాడు.

''అయితే మరో ధర్మ సందేహం తీర్చండి స్వామీ!'' అన్నాను.

''ఊ...'' అన్నాడు.

''సన్యసించగానే ఇలా అడవుల్లోకి ఎందుకు పారిపోయి వచ్చేస్తారూ? విషయ వాసనలు మనుషుల మధ్యలో వుంటే ప్రలోభ పెడ్తాయనా?'' అన్నాను.

''సంసార జీవితం నుండి ముక్తి పొందాక రుష్యాశ్రమంలో వుండడం ఆదినుండీ వస్తోంది!'' అన్నాడు.

''ఇక్కడ మీరు వేటికి దూరంగా ఉన్నారు స్వామీ?'' అన్నాను. లోపల్నుండి సాంబారు ఘుమఘుమలు నా ముక్కు పుటాలకి తగుల్తున్నాయి. నా చూపు ఆయన పక్కన కూర్చున్న ఆడ సన్యాసినుల మీద పడేసరికీ గతుక్కుమన్నట్టు చూశాడు.

''పరమాత్మని యోగసాధన ద్వారా చేరుకుంటే ముక్తి కలుగుతుంది. సుఖాలని త్యజిస్తే ఆనందం వశం అవుతుంది. ఈ ఆశ్రమంలో కొన్నాళ్ళు వుంటే కానీ ఈ ఆనందం అర్థంకాదు! అజ్ఞానం లోంచి నా బిడ్డల్ని జ్ఞానమార్గంలోకి లాగడానికే నేనిక్కడ వున్నాను'' అన్నాడు.

''తెలీక ఏదేదో మాట్లాడింది స్వామీ! క్షమించండి'' దవడలు వాచేటట్లు మరోసారి లెంపలేసుకుంటూ అంది వైదేహి.


ఇంతలో ఒక కుర్రాడొచ్చి ''ఆవిడ మళ్ళీ వచ్చారు స్వామీ'' అని ఓ చీటీ అందించాడు.

బాబా అది చదివి చిదానందంగా గెడ్డం నిమురుకుంటూ ''ఎవరూ ఎవరికీ ఏమీ కారనీ... ప్రస్తుతం ఈ భార్యా... భర్తా అన్న బంధాలేవీ మిగల లేదనీ, ఆమెతో చెప్పి విభూది ప్రసాదం ఇచ్చి పంపండి'' అన్నాడు.

నాలో కుతూహలం ప్రవేశించింది.

ఆ కుర్రాడు విభూతి పొట్లం తీసుకుని వెళ్ళిపోయాక బాబా నాతో ''యోగులకీ, స్వామీజీలకీ భార్యాపిల్లలూ అనే పాశాలు ఉండవు. చూశారుగా పూర్వాశ్రమంలోని నా భార్య నా తండ్రి పోయాడన్న వార్త పట్టుకుని వచ్చి నన్ను తలకొరివి పెట్టమంటోంది. ఎవరు తండ్రీ? ఎవరు కొడుకూ? నాకిప్పుడందరూ బిడ్డలే.. హరిఓం!'' అన్నాడు.

పట్టు వస్త్రాలూ, కుషన్ సింహాసనం, ఏ.సీ., క్రింద ముఖమల్ తివాచీ... ఇదా సర్వసంగ పరిత్యాగం అంటే!



ఇంతలో అనుకోని దుమారంలా రయ్యిమని ఓ స్త్రీ వచ్చి ఆయన కాళ్ళ మీద పడిపోయింది.

''స్వామీ... అందర్నీ కటాక్షిస్తారే? నేనేం పాపం చేశానని నా మీద దయచూపరూ? ఆ తండ్రి ఆత్మకి శాంతి కలగజెయ్యండి. ఒక్కసారి వచ్చి చూడండి...'' అంటూ భోరుమంది.

నేను సంభ్రమంగా ''వ... సుం... ధ... రా!'' అన్నాను.

వసుంధర కళ్ళు తుడుచుకుంటూ నా వైపు చూసి ''మీరూ ఇక్కడే ఉన్నారా?'' అంది.

''ఈయన మీ ఆయనా?'' విభ్రాంతిగా అడిగాను.

''పన్నెండు సంవత్సరాలయింది ఆ బంధాలన్నీ త్యజించి... హరిఓం!'' అన్నాడు బాబా.

''పన్నెండు సంవత్సరాలలో నేనేం కోరలేదు... ఎన్నెన్ని సమస్యలొచ్చినా మీతో చెప్పలేదు. కన్నాను కాబట్టి బిడ్డల్ని పెంచాను. మీలాగే బాధ్యతలు తెలీని వాళ్ళని, ఇంకా సాకుతున్నాను. చివరికి మీ తండ్రిని కూడా... ఈ రోజు మాత్రం కన్నీళ్ళతో అర్థిస్తున్నాను ... ఒక్కసారి రండి!'' అంది.

''అజ్ఞానం... అవివేకం! స్వాములు జరామరణాలకి అతీతులు!'' అన్నాడు.

నేను లేచి వసుంధరని లేవనెత్తాను. ''సమస్యకి భయపడి దూరంగా పారిపోయిన ఈ స్వామీజీలు మన సమస్యలనేం తీరుస్తారు? ఆయన పరిత్యజించింది కష్టాలని! విస్మరించింది బాధ్యతలని! భయపడేది బంధాలకి! ఆయన యోగి అవునో కాదో కానీ మీరు కర్మయోగి! పదండి, చేయవలసిన పనులు చాలా వుండి వుంటాయి, వాటిని పూర్తి చేద్దాం!'' అన్నాను.

వసుంధరతో బాటు నేనూ, వైదేహీ బయటికి నడుస్తుంటే స్వామీజీ ''హరిఓం!'' అని గొణుక్కున్నాడు. ఒక సన్యాసిని మంచినీళ్ళు వెండి చెంబులో అందించింది!

ΟΟΟ

వైదేహి ప్రయాణానికి సిద్ధమవుతుంటే గీతాంజలి అందిస్తూ చెప్పాను ''సర్వసంగ పరిత్యాగంలో కాదు విముక్తి లభించేది... అనంతకోటి అనురాగ బంధాలతో స్వేచ్ఛని కౌగలించుకుంటాను అన్న రవీంద్రుడి మాటలకి అర్థం ఇప్పుడు తెలిసింది.''

వైదేహి నవ్వి ''ఔను స్వేచ్ఛ అంటే మనని మనం వెలివేసుకోవడం కాదు!'' అంది.

''స్వేచ్ఛ అంటే...'' చెప్పబోయి ఆగిపోయాను.

నా ఇంటి ముందు రాబర్ట్ వెహికిల్ ఆగిన చప్పుడు వినిపించింది.

–సమాప్తం.

